అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం

– జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి


రాజంపేట టౌన్: సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆకేపాటి, పోలా

రాజంపేట టౌన్ : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీపురం, బలిజపల్లె రోడ్డు సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు ఆకేపాటి, పోలా చేతుల మీదుగా వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గతంలో ప్రజలు చిన్న సర్టిఫికెట్ కావాలన్నా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రజలు వారికి అవసరమయ్యే సర్టిఫికెట్లకు ఇబ్బందులు పడకూడదని సీఎం ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. పోలా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో వలంటీర్లు జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు ఏయే సర్టిఫికెట్లు అవసరం ఉన్నాయో గుర్తించారన్నారు. అధికారులు అర్హులైన వారికి సర్టిఫికెట్లు మంజూరు చేశారని, వాటిని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచితంగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, జగనన్న సురక్ష మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ మునిశంకరయ్య, జేసీఎస్ మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ వడ్డే రమణ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జెనుగు కృష్ణారావు, కౌన్సిలర్లు పెనిగిలపాటి పెంచలయ్యనాయుడు, సనిశెట్టి నవీన్‌కుమార్, న్యామతుల్లా, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు రెడ్డిమాసి రమేష్‌నాయుడు, జాకీర్ హుస్సేన్, ఎస్.రమణ, బొల్లినేని రామ్మోహన్ నాయుడు, టైగర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడమే లక్ష్యం

రైల్వేకోడూరు : రాష్ట్రంలో ప్రజల సమస్యలను తెలుసుకోవడం, ప్రభుత్వ పథకాలకు అర్హులుగా ఉండి అందనివారిని గుర్తించి లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యం అని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డిలు తెలిపారు. సోమవారం మండలంలోని కె.బుడుగుంటపల్లె పంచాయతీలోని సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరై వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో రేషన్, పెన్షన్, ఇళ్ల పట్టాలు తదితర కార్డులు కావాలంటే అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, జెడ్పీటీసీ రత్నమ్మ, సర్పంచ్ చంద్రశేఖర్, గంగయ్య, యజ్ఞం చంద్రశేఖర్, తహసీల్దారు రామ్మోహన్, హరిక్రిష్ణారెడ్డి, మల్లు క్రిష్ణారెడ్డి, రమణ రెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఓబులవారిపల్లె: ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న సాయికిషోర్ రెడ్డి


రైల్వేకోడూరు: ధృవీకరణ పత్రాలు అందిస్తున్న వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి

అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యం – సాయికిషోర్ రెడ్డి

ఓబులవారిపల్లె : అర్హులకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం మండల పరిధిలోని బాలిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సాయికిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి నెల ఒకటో తేదీ వేకువజామునే వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి వృద్ధులు, దివ్యాంగులకు పెన్షన్ అందజేస్తున్నారని, అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా జగనన్న పాలన సాగుతుందన్నారు. అనంతరం అర్హులైన వారికి ధృవీకరణ పత్రాలను అందజేశారు. తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీఓ విజయారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబురెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ కౌలూరు అమరేశ్వర్ రెడ్డి, ఎంఎల్‌ఓ నాగభూషణం, సర్పంచ్ మేకల సురేఖవేణి, ఎంపీటీసీ సరిత, సుకుమార్, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

టెండర్ల ఆహ్వానం

రాయచోటి టౌన్ : వీరభద్రస్వామి ఆలయంలో స్వామి వారికి నిర్వహించే నిత్య పూజలలో భాగంగా సరుకులు సప్లై చేయుటకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలకమండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిలు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. నిత్యపూజ సామగ్రి, నిత్యాన్నదానానికి సరుకులు అందించేందుకు టెండర్లు నిర్వహిస్తున్నామన్నారు. టెండర్లలలో పాల్గొన దలచిన వారు జీఎస్‌టీ, మూడు సంవత్సరాల ఇన్‌కం టాక్స్ రిటర్న్స్, ఎఫ్ఎస్ఎస్ఏఐ జత చేస్తూ రూ.1లక్ష ఆలయ కార్యనిర్వహణ అధికారి వారి కార్యాలయానికి చెందేలా డీడీ సమర్పించాలని సూచించారు. అలా చెల్లించని వారు అనర్హులుగా గుర్తించి వారి టెండర్‌ను రద్దు చేస్తామని తెలిపారు. టెండర్ నోటీసులు ఈనెల 26వతేదీ సాయంత్రం 6 గంటలలోపు ఆలయంలోని టెండర్ బాక్స్‌లో వేయాలని తెలియజేశారు.

సైబర్ నేరాలపై అవగాహన

సిద్దవటం : మండలంలోని లింగంపల్లెలో సోమవారం సాయంత్రం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సైబర్‌నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. లోన్‌యాప్‌ల ఉచ్చులో పడవద్దని సూచించారు. అంతేగాకుండా అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి మంచి జీవితాన్ని గడపాలన్నారు. గ్రామంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుంటే సమాచారాన్ని పోలీసులకు అందించాలని ఆయన సూచించారు. గ్రామ ప్రజలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించిన 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలోకి మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి పూర్తి చేసిన వారు 10వ తరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 20వ తేదీలోపు పాఠశాలలో అందజేయాలన్నారు. పూర్తి వివరాల కోసం పాఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని వారు కోరారు.

పోషక ఆహారంపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ క్రాంతిరెడ్డి

సిద్దవటం : ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో సోమవారం కడప జగదీశ్ న్యూరో వైద్యశాల ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బెటాలియన్ కమాండెంటు ఎస్.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. క్రాంతిరెడ్డి పోషకాహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అడిషనల్ కమాండెంటు కె. ప్రభుకుమార్, అసిస్టెంటు కమాండెంట్లు వి. కేశవరెడ్డి, పి.ఎస్.డి. ప్రసాద్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ ఎస్ఐలు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించండి

సంబేపల్లె : మండల పరిధిలోని చిన్నబిడికికి వెళ్లే తారు రోడ్డుకు మరమ్మతులు చేయాలంటూ ఎగువరాజుపల్లె, నడిమిరాజుగారిపల్లె, దిగువరాజుగారిపల్లె, ఎర్రబల్లి తదితర గ్రామస్తులు సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌కు వినతిపత్రం అందజేశారు. దేవపట్ల నుంచి చిన్నబిడికికి వెళ్లే మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరితగతిన తారు రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆ గ్రామ సాధన కమిటీ సభ్యులు కలెక్టర్‌ని కోరారు.

అన్నదానం


వృద్ధాశ్రమంలో భోజనాన్ని వడ్డిస్తున్న దాతలు

రామాపురం : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో గాలివీడు మండలం నక్కలవాండ్లపల్లెకు చెందిన సుద్దమళ్ల పార్వతమ్మ రెండవ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారులు వీరాంజనేయులు, మల్లికార్జునల సౌజన్యంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ పి.ఎస్.హరినాథ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మహమ్మద్, వినోద్‌కుమార్ నాయక్, ఆశ్రమం మేనేజర్ సుబ్బయ్య, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ కొళాయి కనెక్షన్‌లు తొలగింపు

సిద్దవటం : మండల కేంద్రంలో అక్రమంగా ఉన్న కొళాయి కనెక్షన్‌లను సోమవారం తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం దిగువపేట గాంధీ వీధిలో ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంకుకు మోటర్ నుంచి ట్యాంకుకు తాగునీరు ఎక్కక పోవడంతో ఎందుకు ఎక్కలేదో పరిశీలించామన్నారు. ట్యాంకుకు నీరు సరఫరా అయ్యే పైప్‌లైన్‌కు 16 మంది అక్రమంగా కొళాయి కనెక్షన్‌లను ఏర్పాటు చేసుకోవడంతో తాగునీరు ట్యాంకుకు ఎక్కలేదన్నారు. దీంతో సోమవారం రెండు కొళాయి కనెక్షన్‌లను తొలగించామని, మిగతా కనెక్షన్‌లను మంగళవారం తొలగిస్తామని ఆయన అన్నారు.

భద్రకాళి సమేతుడికి పల్లకీ సేవ


పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

రాయచోటి టౌన్ : పట్టణంలో వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం పల్లకీ సేవ నిర్వహించారు. రాత్రి వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవారి మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఉత్సవమూర్తులకు అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢ వీధులలో ఊరేగించారు. స్థానిక భక్తులతోపాటు కర్ణాటకకు చెందిన భక్తులు పాల్గొన్నారు. ఆలయ పాలకమండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో పూజలు చేశారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి జయంత్యుత్సవం


రాయచోటి: భక్తులకు దర్శనమిస్తున్న చౌడేశ్వరీదేవి


గాలివీడు: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వీరబల్లె (రాయచోటి టౌన్): మండల పరిధిలోని మట్లి గ్రామంలోని చౌడేశ్వరీ దేవి అమ్మవారి జయంతి సందర్భంగా ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. ఈ పూజలు దిద్దేపురం తిరుపతమ్మ రామనారాయణల జ్ఞాపకార్థం వారి కుమారులు, కోడళ్లు ఉమాశంకర్, అనిత, ధనుంజయ, మీనాక్షి, తొగటవీర క్షత్రియ సంఘం నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

రాయచోటిలో..

పట్టణంలోని కొత్తపేటలోని తొగటవీర క్షత్రియ సంఘం నాయకులు చౌడేశ్వరీ దేవి అమ్మవారికి సోమవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారి జయంతి సందర్భంగా ఈ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలకమండలి సభ్యులు తెలిపారు. భక్తులకు అన్నప్రసాదాలను పంచిపెట్టారు.

దుష్ట శిక్షణకే అమ్మవారు ఆవిర్భావం

గాలివీడు : కలియుగంలో దుష్టులను శిక్షించుటకే చౌడేశ్వరి దేవి ఆవిర్భవించిందని వేదపండితులు సుబ్రహ్మణ్యం శర్మ పేర్కొన్నారు. సోమవారం ఆషాఢ మాసం అమావాస్య పర్వదినాన చౌడేశ్వరి జయంతి వేడుకలను పూలకుంట చౌడేశ్వరి దేవత ఆలయంలో ఘనంగా నిర్వహించారు. వేకువజామునే అమ్మవారి మూలవిరాట్ మూర్తికి అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మోడెం వెంకటేష్, రమణ, రెడ్డప్పనాయుడు, చెంద్రాయుడు, చౌడేశ్వరి అమ్మవారి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

లైసెన్స్‌లు మంజూరు చేయండి


సమస్యను కలెక్టర్‌కు విన్నవిస్తున్న ఎన్.క్రిష్టయ్య

రాయచోటి అర్బన్ : కల్లుగీత కార్మికులకు నూతన కల్లుగీత టీఎఫ్‌టీ లైసెన్స్‌లను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌కు ఈడిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎన్.క్రిష్టయ్య విజ్ఞప్తి చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ఆయన కలెక్టర్‌ను కలిశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం 2022 నుంచి 2027 వరకు నూతన కల్లుగీత పాలసీని ప్రకటించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో పాత లైసెన్స్‌లను పునరుద్ధరించడంతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికీ అనుమతులు మంజూరు చేశారన్నారు. అన్నమయ్య జిల్లాలో పాత లైసెన్స్‌లను పునరుద్ధరించిన అధికారులు నూతన లైసెన్స్‌లను మంజూరు చేయలేదన్నారు. వాటిని ఆమోదించాలని ఆయన కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో కల్లు గీత కార్మికులు నాగరాజు, ఓబులేసు, వెంకటేశు, సతీష్‌కుమార్, చనగాని నాగరాజు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సమాజం పట్ల అవగాహనతోనే ఉన్నత స్థాయికి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి

రాయచోటి : విద్యార్థి దశలోనే సమాజం పట్ల చక్కని అవగాహనను పొందితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరతారని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి అన్నారు. రాయచోటిలోని డైట్ కళాశాల ఆవరణలో మ్యాజిక్ బస్సు ఆధ్వర్యంలో నిర్వహించిన యాక్టివిటీ బేస్డ్ లైవ్ స్కిల్స్ శిక్షణా కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఎస్ఆర్‌జీలు కడప నుంచి ఎంపిక కాబడిన 50 పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, ఒక యాక్టీవ్ టీచర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయ, ఉపాధ్యాయులు ప్రాముఖ్యతను ప్రిన్సిపాల్ వివరించారు. ప్రాజెక్టులో అందరూ చురుగ్గా పాల్గొని అవగాహన చేసుకొని విద్యార్థులకు తర్ఫీదును అందించాలని సూచించారు. డైట్ లెక్చరర్ శివభాస్కర్ మాట్లాడుతూ మ్యాజిక్ బస్సు లైఫ్ స్కిల్స్ ఫ్రేమ్ వర్క్‌ను అభినందించారు. ఈ బోధనను పిల్లల్లోకి తీసుకువెళ్లి వారు ఉన్నతస్థాయికి చేరుకునేటట్లు చూడాలన్నారు. డైట్ అధ్యాపకులు శ్రీదేవి, నాగేశ్వరరావు, జాఫర్, కడప ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అరుణకుమారి, జిలానీ బాషా, హసీనా, రమేష్, దేవకమ్మ, మ్యాజిక్ బస్ రీజనల్ మేనేజర్ శ్యామ్, స్కూల్ ఫెసిలిటేటర్ ప్రణవి, శివకిషోర్‌లు పాల్గొన్నారు.

మా కాలనీలో మౌలిక వసతులు కల్పించండి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాయచోటి అర్బన్ : పట్టణంలోని మహబూబ్‌నగర్ వాసులకు అధికారులు వెంటనే మౌలిక వసతులను కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. తమ ప్రాంత సమస్యల పరిష్కారం కోసం మహబూబ్‌నగర్ వాసులు సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మహబూబ్‌నగర్ వాసులకు మౌలిక వసతులు లేవన్నారు. రమీజా మసీదు చుట్టుపక్కల ప్రాంతాల్లో మురుగు నీటి కాలువలలో పూడికకారణంగా నీరంతా రోడ్లపై ప్రవహిస్తోందన్నారు. కొద్దిపాటి వర్షం వచ్చినా మురుగునీరంతా ఇళ్లలోకి వస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం ఒక వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్‌కు అందచేశారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ వాసులు జాబీరున్నీసా, మెహరున్నీసా, చాన్‌బీ, బాబాఫక్ర్‌ద్దీన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరాన్ని విజయవంతం చేయండి

గాలివీడు : ఈనెల 20వ తేదీన ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రామాపురం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో తిరుపతికి చెందిన శ్రీ వేంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆవుల నాగభూషన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతి గ్రామం పర్యటించి కంటి సమస్యల గల ప్రజలను గుర్తించి ఈ వైద్య శిబిరానికి తరలించాలని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

కడప-బెంగళూరు రైల్వేలైన్‌ను ఏర్పాటు చేయాలి

రాయచోటి అర్బన్ : కడప నగరం నుంచి వయా రాయచోటి, మదనపల్లెల మీదుగా బెంగళూరుకు రైల్వేలైన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు డిమాండ్ చేశారు. రైల్వేలైన్ ఏర్పాటులో పాలకుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సోమవారం పట్టణంలోని బంగ్లా సర్కిల్ వద్ద సీపీఐ నేతలు ధర్నాను నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, గౌరవ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసులు, రైతు నేత వి.రంగారెడ్డి, సుధీర్‌కుమార్, పి.ఎల్.వెంకటేష్, ఏఐటియుసి నేతలు వెంకటేష్, అంజనప్ప, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలకు లైసెన్సులు తప్పనిసరి

రామాపురం : మండలంలో కూరగాయల నర్సరీ యజమానులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకొని లైసెన్సులు పొందాలని ఉద్యానశాఖ అధికారిణి నాగమణి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని నర్సరీలను తనిఖీ చేశారు. మాట్లాడుతూ లైసెన్సులు పొందిన నర్సరీ యజమానులు మాత్రమే విక్రయాలు చేయాలన్నారు. తనిఖీ సమయంలో రికార్డులు అందుబాటులో ఉండాలన్నారు. రైతులకు నాణ్యమైన నారుతోపాటు రశీదులు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది, ప్రవీణ్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

నూలివీడులో పొలంబడి

గాలివీడు : మెళకువలు పాటిస్తే వేరుశనగ పంట సాగు ఖర్చులు తగ్గించవచ్చునని మండల వ్యవసాయ అధికారి మురళీధర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నూలివీడు గ్రామంలో పొలంబడి శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విత్తనశుద్ధిలో పాటించాల్సిన పద్ధతులు, మిత్రపురుగుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్‌లో చదరపు మీటరకు 33 మొక్కలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, రసాయన ఎరువులు వినియోగించడం ద్వారా దుష్ప్రభావాలు గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యయసాయ సిబ్బంది వీఏఏలు, వీహెచ్ఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది , రైతులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులకు అన్నదానం

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కేంద్రంలోని కలెక్టర్, ఎస్పీ కార్యాలయానికి (స్పందనకు) వచ్చే అర్జీదారులకు ఉచితంగా భోజనం అందజేస్తున్నారు. ఈ కార్యక్రమం ప్రారంభించి సోమవారంతో 28వ వారానికి చేరుకొంది. అర్జీదారులకు ఇలా ఉచితంగా భోజనం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

రామాపురం : చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారిలోని గంగనేరు క్రాస్ సమీపంలో సోమవారం రామాపురం నుంచి రాయచోటి వైపు వెళ్తున్న ఏపీ03 టీఎల్ 3103 ఆటో డ్రైవర్ మద్యం సేవించి నడపడంతో ఆటో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికుడికి రెండు కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసిన రామాపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సేవకు సలాం



కరోనాలోనూ ఆగని సంక్షేమం


తిరుపతిలోని ఓ ఆసుపత్రిలో సుబ్బమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ గంగాదేవి

మానవాళిని కరోనా అతలాకుతలం చేసింది. సొంత మనుష్యులను సైతం దూరం ఉంచేలా చేసింది. అలాంటి విపత్కర సమయంలోనూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం ఆగకూడదని నిర్ణయించి.. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ వలంటీర్ల ద్వారా వారికి అందాల్సిన ప్రతి సాయాన్ని అందించారు. మనకు కనిపిస్తున్న ఈ చిత్రంలో వలంటీర్ గంగాదేవి తన పరిధిలోని పింఛన్‌దారు సుబ్బమ్మ అనారోగ్యం కారణంగా తిరుపతిలో చికిత్స తీసుకుంటోందని సమాచారంతో అక్కడకు వెళ్లి పింఛన్‌ను అందించి స్ఫూర్తిగా నిలిచింది. తన క్లస్టర్ పరిధిలోని కుటుంబాలకు పిలిస్తే పలికేలా ఉంటూ అందరి మన్ననలు పొందుతోంది. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న ఇలాంటి వలంటీర్ల సేవలకు అందరూ సలాం చేస్తున్నారు.

– రైల్వేకోడూరు

వలంటీర్ మేలు మరిచిపోను



తనకు అనారోగ్యం కారణంగా మెరుగైన వైద్యం కోసం తిరుపతిలో చికిత్స పొందుతున్న సమయంలో వలంటీర్ గంగాదేవి ఆసుపత్రికి వచ్చి తనకు పింఛన్ అందించింది. తన ఆరోగ్య సమస్యను గుర్తించి తాను ఎక్కడుంటే అక్కడికి వచ్చి పింఛన్ అందించడం చాలా గొప్ప విషయం. గత ప్రభుత్వంలో పింఛన్ తెచ్చుకోవాలంటే ఇబ్బందులు పడే వాళ్లం. జగన్ హయాంలో వలంటీర్లే నేరుగా ఇంటికే వచ్చి పింఛన్‌తోపాటు వివిధ రకాల సేవలను అందిస్తుండటం హర్షణీయం. సీఎంగా జగన్ బాబు పది కాలాలుండాలి.

– నూరా సుబ్బమ్మ, తంబిళ్లవారిపల్లె, రైల్వేకోడూరు

నిత్యావసర సరుకుల పంపిణీ


కరోనా సమయంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న వలంటీర్లు

కరోనా లాక్‌డౌన్ కారణంగా ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు అనేకం. అలాంటి విపత్కర సమయంలో వారికి అండగా నిలవాలని ప్రభుత్వం నిర్ణయించి వారికి అవసరమైన రేషన్ సరుకులు, కూరగాయలు, రూ.1000 నగదును అందజేసింది. వీటి పంపిణీలో వలంటీర్లు చురుగ్గా సేవలందించారు. పై చిత్రంలో వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలకు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ సరుకుల పంపిణీ చేశారు. కోవిడ్ కేసులను గుర్తించడంలోనూ వీరి సేవలు ఎంతో విలువైనవి. ప్రజలకు జాగ్రత్తలను తెలియపరచేందుకు వలంటీర్లు శ్రమించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సేవలోనూ వలంటీర్లు వారధిలా నిలవడం ఎంతైనా అభినందనీయం.


– రైల్వేకోడూరు

వలంటీర్ అండగా నిలిచింది

వలంటీర్ల సేవలు అద్భుతంగా ఉన్నాయి. ప్రత్యేకించి కరోనా సమయంలో వలంటీర్లు అందజేసిన సేవలు మరువలేం. అయినవారు సైతం పట్టించుకోని సమయంలో వలంటీర్లు ప్రాణాలను లెక్క చేయకుండా ప్రజలకు సేవ చేశారు. అటువంటి సమయంలో ప్రభుత్వం అందజేసిన నిత్యావసర సరుకులను పంపిణీ చేసి అండగా నిలిచారు. కరోనా బాధితులతోపాటు ప్రతి ఇంటి వద్దకు వెళ్లి మనోధైర్యాన్ని నింపిన తీరు ఎప్పటికీ మరువలేం.

– వెంకటమ్మ, అనంతరాజుపేట, రైల్వేకోడూరు

ఓటరు జాబితాపై ప్రత్యేక దృష్టి సారించండి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మేడా

నందలూరు(రాజంపేట) : అన్ని శాఖల సమన్వయంతో అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అధికారులకు పిలుపునిచ్చారు. సోమవారం తన చాంబరులో సచివాలయ సిబ్బంది, బీఎల్‌ఓ, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ సౌభాగ్య, తహసీల్దార్ వైఎస్ సత్యానందంతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల వారీగా అన్ని వర్గాలకు మేలు జరిగే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన నవరత్నాల లక్ష్యాలను అధిగమించాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తరాదన్నారు. ప్రజారోగ్యంపై ముఖ్యమంత్రి దృష్టి సారించిన క్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపరుచుకోవాలన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో గ్రామాల వారీగా ఓటర్ల జాబితాపై దృష్టి సారించాలన్నారు. డబుల్ ఎంట్రీలు, డెత్ తదితర ఓట్లను బీఎల్‌ఓలు వారికి ఇచ్చిన ప్రత్యేక యాప్ ద్వారా తొలగించాలన్నారు. తహసీల్దారు వైఎస్ సత్యానందం మాట్లాడుతూ సచివాలయం, రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు సమన్వయంతో ఓటర్ల జాబితా పరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి లోపాలు లేకుండా సరిచేయాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీఓ టీ.సరళాదేవి, ముదిరాజ్ కార్పొరేషన్ స్టేట్ డైరక్టరు భువనబోయిన లక్ష్మీనరసయ్య, మండల కో-ఆప్షన్ సభ్యుడు కలీం, అన్నం నాగేంద్ర, నాయకులు యల్లంరాచపల్లె సుబ్బారెడ్డి, మాజీ ఎంపీటీసీ పసుపులేటి సుబ్రమణ్యం, ఎన్ఆర్ఐ చలపతి తదితరులు పాల్గొన్నారు.